క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి..

జూలూరుపాడు: కుమురంభీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలూరుపాడులో 9వ తేదీన జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తెల్లం నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జూలూరుపాడులో భీమ్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆదివాసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సిద్దెబోయిన రామ్మూర్తి, సోడె శ్రీరామ్, మడి రవి, సిద్దెబోయిన మోహన్, పూనెం సూరయ్య, మందరెకల నాగరాజు, మల్కం శివ, కొడెం సీతాకుమారి, ఇర్పా ముఖేష్, గుర్రం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సుజాతనగర్: తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బ్యాగులు తదితర సామగ్రిని బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉడుముల తిరుపతిరెడ్డి, బీవీఎస్ఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన ఉద్యోగులకు కౌన్సెలింగ్

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో గైర్హాజరైన సింగరేణి ఉద్యోగులకు బుధవారం జీఎం వీసం కృష్ణయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ.. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో హాజరు శాతం పెంచుకునేలా సహాయం చేస్తామన్నారు. ప్రతీ నెల 22 మస్టర్లు విధిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఏజీఎం గిరధర్‌రావు, డీజీఎం పర్సనల్ తుకారం, అధికారులు పాల్గొన్నారు.

జనగణనలో ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

ఇల్లెందు: దేశంలో చేపట్టబోయే జనగణనలో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని, 5, 6 షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ఆపాలని, ఆదివాసీ చట్టాలు, హక్కుల రక్షణకు ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు పిలుపునిచ్చారు. బుధవారం ఇల్లెందులో సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, ఇల్లెందు మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. కారం పుల్లయ్య, దుగ్గి కృష్ణ, మూతి రాజశేఖర్, కొడెం బోస్, చీమల రమణ, కల్తీ అన్నపూర్ణ, పూనెం భవానీ, కొడెం రఘు, కోలా ప్రవీణ్, ముడిగె కృష్ణకుమారి, వజ్జా సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం రుద్రంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను బుధవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కే.విజయ్‌బాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ టాటా కంపెనీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ సెంటర్‌లో 80శాతం పనులు పూర్తయినట్లు చెప్పారు. ఈ టెక్నాలజీలో విద్యార్థులకు ఆరు కొత్త కోర్సులను అందించనున్నామని, 172 సీట్లు ఉంటాయని, వీటిలో మూడు కోర్సులు రెండేళ్లు, మరో మూడు కోర్సులు ఒక సంవత్సరం పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఫార్మర్ ఐడీ తప్పనిసరి

పాల్వంచరూరల్: రైతుల సంక్షేమానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా అన్నదాతలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో పదకొండు అంకెలతో ఐడీ కేటాయించేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో వ్యవసాయశాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో మొత్తం రైతులు 5,157 మంది ఉండగా, ఇప్పటి వరకు 2,502 మంది ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకున్నారు. మండల కేంద్రంతోపాటు, ఆయా క్లస్టర్ల వారీగా రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు నేరుగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తారని వివరిస్తున్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ నంబర్‌కు లింక్ చేసిన సెల్ ఫోన్ తీసుకెళ్లాలి.

సైన్స్‌ను దుర్వినియోగం చేయొద్దు..

కొత్తగూడెంఅర్బన్: సైన్స్‌ను మంచికి వినియోగించాలని, దుర్వినియోగం చేయకూడదని, తద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతాయని సింగరేణి ఉమెన్స్ కళాశాల అధ్యాపకురాలు రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం కొత్తగూడెం మోడల్ స్కూల్‌లో ప్రపంచ శాంతి దినోత్సవం నిర్వహించారు. హాజరైన ఆమె మాట్లాడుతూ హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబు వేయడం వలన జరిగిన నష్టాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి, జవాబులు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. కరెస్పాండెంట్ ఝాన్సీరాజ్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యురాలు కస్తూరి, ఎం.మోహన్‌రావు, తిరుపాలు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి

తెలంగాణ జాతిపిత, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జయశంకర్ సార్ చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ... నీళ్లు, నిధులు సిద్ధాంతంగా రూపొందించుకొని ప్రజలను చైతన్య పరిచి జీవితాంతం తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. జయశంకర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని, ఆయన మార్గంలో పయనించి బంగారు తెలంగాణ నిర్మాణం చేయాలని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: కేటీపీఎస్‌లో మాట్లాడుతున్న సీతా శివరామ్‌రెడ్డి



చుంచుపల్లి: జెడ్పీలో... సీఈఓ నాగలక్ష్మి, సిబ్బంది



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న కమిషనర్ శ్రీకాంత్



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య



జూలూరుపాడు: హైస్కూల్‌లో..



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్యాలయంలో..



పాల్వంచరూరల్: తహసీల్‌లో...

సాంస్కృతిక విప్లవ ప్రజాసేనాని గద్దర్



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

టేకులపల్లి: జననాట్యమండలి వ్యవస్థాపకుడు, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షపరుడు, ప్రజాయుద్ధ నౌక అమరుడు గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు అన్నారు. బుధవారం టీపీఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లి మండల కేంద్రంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాట్లాడుతూ విప్లవోద్యమ ఉద్యమ మొదటి తరానికి చెందిన వ్యక్తిగా, ఆనాటి విప్లవోద్యమం జననాట్యమండలి (జేఎన్ఎం)ని గద్దర్ నాయకత్వంలో ఏర్పాటు చేసి తన మిత్ర బృందమైన అమరులు దయన్న, డప్పు రమేష్, సంజీవ్ తదితరులతో జతకట్టి ఆటపాట మాట ద్వారా ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా తదితర ప్రాంతాలలో కళారూపాలు ప్రదర్శించి ప్రజల్ని చైతన్యవంతం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామటెంకి అశోక్, ఎట్టి ప్రశాంత్, దుగ్గారపు వీరభద్రం, బానోత్ లక్పతి, బొమ్మెర లాలయ్య, పోతురాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం సాధ్యం

చుంచుపల్లి: బీజేపీతోనే అన్నివర్గాలకు సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. దీనిపై ఢిల్లీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, నాయకులు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేసే దమ్ము లేక, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసేందుకు కాంగ్రెస్ నాటకం ఆడుతోందని విమర్శించారు. ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా విస్మరించిందని అందులో ముస్లింలను చేర్చడం విరుద్ధమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలను చేస్తూ కాంగ్రెస్ బీసీలను మభ్యపెడుతోందన్నారు. ప్రజా వ్యతిరేకతను గుర్తించి కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదన్నారు. నరేంద్రబాబు, రవీందర్, బలగం శ్రీధర్, గొడుగు శ్రీధర్, జల్లారపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

రాజకీయ జోక్యాన్ని నియంత్రించండి..



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో రాజకీయ జోక్యం కారణంగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆ యూనియన్‌కు చెందిన నాయకులు, మంత్రులు వచ్చి గాలికొదిలేసే వాగ్దానాలు ఇచ్చి ఓట్లు దండుకొని కార్మికులకు మోసం చేశారని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ విమర్శించారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ఆటో వర్క్‌షాప్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. యూనియన్ సభ్యత్వ వెరిఫికేషన్ విధానం కోలిండియా తరహాలో అమలు చేయాలి డిమాండ్ చేశారు. గనుల మీద పిట్ సెక్రటరీలు కూడా లేకుండా కొంతమంది అధికార రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చారన్నారు. గెలిచిన నాయకులు కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు గాలిలో కలిసి పోయాయన్నారు. ఈ కార్యక్రమంలో మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, ఠాగూర్, చంద్రశేఖర్, ఎం.శ్రీనివాస్, శ్యామ్‌లాల్, వడ్డీకాసులు, బానోత్ రవి, ఇనపనూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

కొత్తగూడెంఅర్బన్: పుట్టిన శిశువులకు తల్లిపాలే పట్టించాలని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రైటర్‌బస్తీ గొల్లగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల నుంచి తల్లీపిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించేందుకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఏఎన్ఎం గంగాభవాని, ఆశా దేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు పాల్గొన్నారు.

కొత్తగూడెంటౌన్: తల్లిపాలే బిడ్డకు మేలు చేస్తాయని, ప్రతీ బిడ్డకు పుట్టిన వెంటనే తల్లిపాలు తప్పక పట్టించాలని కొత్తగూడెం సీడీపీఓ పద్మశ్రీ అన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని 29, 30 వార్డులలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. ప్రతీ తల్లి బిడ్డల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకే తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట రమణ, టీచర్లు సన్యాసీ బస్తీ గుణ లక్ష్మీ, మధురబస్తీలో ఎం.కమల, హేమమనోరంజని, భవానీ, క్రాంతి రాజేశ్వరీ, జయమ్మ, విజయలక్ష్మి, రూపేంద్ర, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



కొత్తగూడెంటౌన్: ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ పద్మశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు

పాల్వంచరూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం వలన బిడ్డకు ఆరోగ్యం అని ఉల్వనూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని తిరకాలపాడు గ్రామంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కృష్ణకుమారి, ఆశా యాశోద, తల్లులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ కాంగ్రెస్ నేతృత్వంలో ఢిల్లీ జంతర్ మంతర్‌లో జరిగిన ధర్నాలో కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోనేరు సత్యనారాయణ(చిన్ని), మండే వీరహనుమంతరావు, చింతలపూడి శేఖర్‌తో తదితరులు ఉన్నట్లు పేర్కొన్నారు.

జూలూరుపాడు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమానికి జూలూరుపాడు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వెళ్లారు. వెళ్లిన వారిలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గోపు రామకృష్ణ, లకావత్ లచ్చు, గుగులోత్ రాంబాబు, భూక్యా అనిల్, భట్టు రాజు, తదితరులు ఉన్నారు.

రేపు చిరంజీవి పాటల పోటీలు

కొత్తగూడెంఅర్బన్: సినీనటుడు చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటల పోటీలను కొత్తగూడెంలో 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ మద్దెల శివకుమార్ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక పీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని సెమీస్‌కు ఎంపిక చేస్తామని వెల్లడించారు. బి.విల్సన్ బాబు, అల్లి శంకర్, ధనరాజ్ పాల్గొన్నారు.

ఎన్ఎండీసీని పునరుద్ధరించాలి

పాల్వంచ: పాల్వంచలో మూతబడిన ఎన్ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించాలని ఐఎన్‌టీయూసీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు బాలునాయక్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ఎన్ఎండీసీ హెడ్డాఫీస్‌లో పర్సనల్ డైరెక్టర్ ప్రియదర్శిని కలిసి వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ కర్మాగారం ప్రారంభించడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో రాఖీ బుకింగ్స్ ప్రారంభం

చుంచుపల్లి: అక్కాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచేది రాఖీ పండుగ. ఈనెల 9న రాఖీ పండుగ సందర్భంగా దూరప్రాంతాల్లోని సోదరులకు కార్గో కౌంటర్ ద్వారా రాఖీలు బుక్ చేసుకుని పంపించుకునే అవకాశం కల్పించారు. కొత్తగూడెం ఆర్టీసీ కార్గోలో రాఖీ బుకింగ్ కౌంటర్‌ను బుధవారం డిపో మేనేజర్ డి.దేవేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూరప్రాంతాలకు వెళ్లలేని అక్కచెల్లెళ్ల కోసం అన్ని బస్టాండ్‌ల్లోని కార్గో సెంటర్ల ద్వారా రాఖీలు బుక్ చేసుకుని పంపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, ఎర్నింగ్స్ ఇన్‌చార్జ్, ఖమ్మం రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కె.హరివర్మ, కొత్తగూడెం ఇన్‌చార్జ్ బి.హనుమ, సిబ్బంది పాల్గొన్నారు.



బుకింగ్‌ను ప్రారంభిస్తున్న డీఎం దేవేందర్‌గౌడ్

9న ఆదివాసీల ‘చలో బోడు’

టేకులపల్లి: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బోడు గ్రామంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీల హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం బోడులోని కొమురం భీమ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవి తల్లి ముద్దుబిడ్డలు, భారతదేశానికి మూలవాసులు అయిన ఆదివాసీలు 70 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో మనుగడ కోసం, అస్తిత్వం కోసం అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై లంబాడీ నాయకుల అనుచిత వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. కుంజ సురేష్, రాం ప్రసాద్, నాగయ్య, సంతోష్ పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని న్యూడెమోక్రసీ నేతలు రాంసింగ్, సనప రాంబాబు అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాట్లాడుతూ.. గిరిజనుల కోసం రాజ్యాంగంలో అనేక హక్కులు, చట్టాలు రూపొందించబడినా అమలు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమవుతున్నారని ఆరోపించారు. అటవీ సంపదపై గిరిజనులకే పూర్తి హక్కులు కల్పించాలని, పోడు సాగు చేసుకుంటున్న రైతులందరికీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సనప రాంబాయి, ఈసం రాధమ్మ, చంటి, కవిత, రవి, కుమారి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐపై కార్మికులకు అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ అమలుపై జీఎం పర్సనల్ (ఐఆర్ పీఎం) కవితానాయుడు సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈఎస్ఐ అమలుకు తక్షణమే చర్యలు చేపట్టాలని దీనిపై కాంట్రాక్టర్లు, అధికారులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ గురించి వివరిస్తూ తక్షణమే సభ్యులుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.21,000 లోపు వేతనం ఉన్నవారు దీనికి అర్హులని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ జీఎం దనసరి వెంకటేశ్వర్లు, ఏజీఎం పర్సనల్ మేనేజర్ అజయ్‌కుమార్, ఈఎస్ఐ వరంగల్, హైదరాబాద్ రీజియన్ స్థాయి అధికారి సాయికిరణ్, సత్తుపల్లి, కొత్తగూడెం ఏరియా కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం కవితానాయుడు

సమస్యల సాధనకు నేడు నిరసన



మాట్లాడుతున్న ఎండీ రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టనున్నామని ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. బుధవారం రుద్రంపూర్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానంగా మెడికల్ అటెండెన్స్ రూల్స్‌ను మార్చాలని, గత మెడకల్ బోర్డ్‌లో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ బోర్డును రద్దు చేసి, తిరిగి బోర్డు నిర్వహించాలన్నారు. అదేవిధంగా అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్ మెన్, ఈపీ ఆపరేటర్లకు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సమస్యలతో మరికొన్ని సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్మికులందరూ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల కింద ముమ్మరంగా వరినాట్లు

జూలూరుపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు జూలూరుపాడు మండలంలోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరింది. అయినా ఆయా చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్ కింద ఆయకట్టు భూముల్లో, వ్యవసాయ బోర్ల కింద రైతులు ముమ్మరంగా వరి పంట సాగు చేపట్టారు. వర్షాలకు ప్రధానమైన సాగునీటి చెరువులు కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్టు చెరువు, కొత్తూరు శనగ చెరువు, పాపకొల్లు(భోజ్యా తండా) దండేల చెరువు, జూలూరుపాడు కప్పల కుంట, విప్పజాల కుంట చెరువు, గుండెపుడి మేడి కుంట చెరువు, వెంగన్నపాలెం జమ్మికుంట, కాకర్ల నాగులకుంట, మాచినేనిపేట ఊరకుంట, పడమటనర్సాపురం గోపాలకుంట చెరువులు నిండాయి. అదేవిధంగా అన్నారుపాడు, గురువాగుతండా ఎదుళ్లవాగు, భేతాళపాడు, కరివారిగూడెం, గుండ్లరేవు, రాచబండ్లకోయగూడెం చెక్‌డ్యామ్‌లు జలకళతో కళకళలాడుతున్నాయి. మండలంలో 18 చెరువులు, కుంటల కింద ఆయకట్టు 1302.5 ఎకరాలు కాగా, వ్యవసాయ బోర్లు, చెక్ డ్యామ్‌లు, వాగుల కింద 1,870 ఎకరాలు, మొత్తం 3,172.5 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, వాగుల ఆయకట్టు భూముల్లో రైతులు ట్రాక్టర్లతో గొర్రుతోలడం, దమ్ము చేయడం, కూలీలతో పొలం గట్లు వేయడంతోపాటు, వరినాట్లు వేయించే పనిలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్‌తో దున్నడానికి ఎకరానికి రూ 7,000, గట్లు(దుగాలు) వేయడానికి రూ.1,500, వరి నాటుకు రూ.5,000 రైతులు ఇస్తున్నారు.




జూలూరుపాడులో వరినాట్లు వేస్తున్న కూలీలు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు


చెరువులు నిండాయి..



ఇటీవల జోరు వానలకు కొత్తూరు శనగ చెరువు, లక్ష్మీదేవి కుంట నిండాయి. 16 ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నాం. ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్నాం. చెరువులు రెండుసార్లు నిండితేనే పంట పండుతుంది. లేదంటే బోర్ నీటిని ఉపయోగిస్తేనే పంట పండుతుంది.

– కిలారి నాగరాజు, రైతు, జడలచింత


రెండున్నర ఎకరాల్లో నాటు వేశాం..



రెండున్నర ఎకరాల్లో వరి పంట బోరు కింద సాగు చేసినం. వానలుకురిస్తేనే పంట పడుతుంది. ఎకరం పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేయడానికి రూ.7 వేలు, నాటు కూలీలకు రూ.5,000, దుగాలు వేయడానికి రూ.1500, ఎరువులకు రూ.2,500, మొత్తం రూ.80 వేలు అయింది.

– భూక్యా భద్రు, రైతు, భోజ్యాతండా

మళ్లీ వానలు కురిస్తేనే...



నెల రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా వానలు కురిసినా చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండలేదు. వర్షాలు కురుస్తాయనే ఆశతో వరి పంట సాగు చేశాం. ఎలాంటి సాగు నీటి ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షమే ఆధారం. ఈ ఏడాది యూరియా సమస్యగా మారింది.

– భూక్యా సీతారాం, రైతు, పాపకొల్లు